సాక్షి
సూర్యాపేట
సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



రైస్ మిల్లర్ల ప'రేషన్'

రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం డిమాండ్ పడిపోయింది. - 8లో



తుంగతుర్తికి పెద్దపీట

సాగునీటి వనరుల కల్పనలో తుంగతుర్తి నియోజకవర్గానికి మంత్రి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. - 8లో



మిస్టరీగానే తల్లి, కుమార్తె మరణం

మిర్యాలగూడలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన తల్లి, కుమార్తె మరణం మిస్టరీగా మారింది. - 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలి



చైతన్య బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం దక్షిణ తెలంగాణ కోఆర్డినేటర్ అనంతుల మధు కోరారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల చైతన్య బస్సు యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతుల మధు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ఆరు సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అలుపెరుగని పోరాటం చేస్తుందని తెలిపారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల అంశం చేర్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీను వాస్, తెలంగాణ ఉద్యకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోర్లిళ్ల విప్లవ్ కుమార్, రాష్ట్ర నాయకులు పడిదల ప్రసాద్, తెలంగాణ ఉద్యమ నాయకులు పంతం యాకయ్య, బాసిపంగు సునీల్, ఎండీ మజహర్, యాతకుల సునీల్, అంజయ్య, భారీ ఖాన్, దుర్గయ్య, నాగేశ్వర్ రావు, రాష్ట్ర నాయకులు సురేందర్ రెడ్డి, విరస్వామి, జ్యోతి రెడ్డి, గగన్ కుమార్, జానికి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు



ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

అనంతగిరి: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా రెమిడాల రాజు, ప్రధాన కార్యదర్శిగా దూళిపాళ్ల ధనుంజయ నాయుడు ఎన్నికయ్యారు. శనివారం అనంతగిరిలో జరిగిన వ్యవసాయ కార్మికసంఘం నాల్గవ జిల్లా మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. తమ నియామకానికి సహకరించిన వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, హనుమంతరావుకు ఆదివారం వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా నారసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేశారు. హోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. ఎదుర్కోళ్ల మహోత్సవం అనంతరం స్వామివారి కల్యాణం జరిపించారు. అదేవిధంగా గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో స్వామిఅమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశం తరువాత మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

గాలిదుమారం.. వడగండ్లు



తిరుమలగిరి: అనంతారంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు




నాగారం : నాగారంబంగ్లాలో గాలిదుమారానికి నేలరాలిన మామిడికాయలు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి, నిమ్మకాయలు
- విరిగిపడిన చెట్ల కొమ్మలు
- పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూర్యాపేట అర్బన్, ఆత్మకూర్(ఎస్), తిరుమలగిరి, అర్వపల్లి, నూతనకల్ నాగారం, నడిగూడెం : అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. అకాల వర్షాలు రైతులకు అంతులేని కష్టాలు తెచ్చిపెడుతున్నాయి జిల్లాలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత దశలో ఉన్న వరి నేలవాలింది. కరెంట్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- సూర్యాపేట పట్టణంలో బలమైన ఈదురు గాలులు వీయంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు సుమారు రెండు గంటల తర్వాత విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈదురుగాలుల బీభత్సవానికి కుడకుడలోని ఓ ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. ప్రహరీ కూలిపోయింది.
- నాగారం మండలంలో వరిచేలు, పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. నర్సింహులగూడెం గ్రామానికి వెళ్లే రహదారిపై చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో వరి పైరు నేలకొరగగా, మామిడి, నిమ్మ తోటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి.
- ఆత్మకూర్(ఎస్) మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు విరిగి, విద్యుత్ స్తంభాలు కూలాయి. సుమారు 40 నిమిషాల పాటు ఈదురు గాలులు వీయడంతోపాటు రాళ్ల వర్షం కురిసింది. పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. అకస్మాత్తుగా వచ్చిన గాలివానతో ధాన్యం రాశులపై పట్టాలు కప్పడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు.



తిరుమలగిరి : తొండ గ్రామంలో పడిన వడగండ్లు

- తిరుమలగిరి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరద నీరు చేరింది. భారీ ఈదురు గాలులకు మామిడి, నిమ్మకాయలు నేలరాలాయి. అదేవిధంగా నూతనకల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వర్షానికి తడిసి ముద్దయింది.
- జాజిరెడ్డిగూడెం మండలంలోరైతులు తీవ్రంగా నష్టపోయారు. జాజిరెడ్డిగూడెం. అర్వపల్లి, కోడూరు, తూర్పుతండా కాసర్లపహాడ్ తదితర గ్రామాల్లో వరిపంటలకు నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో కొంత ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. జాజిరెడ్డిగూడెంలో నోముల నరేష్ ఇంట్లో చెట్టుకొమ్మ విరిగి గేదెపై పడి మృతిచెందింది. అర్వపల్లిలో హైవేలు జలమయమయ్యాయి. మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.
- నడిగూడెం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బృందావనపురం గ్రామంలో తాటి చెట్టుపై పిడుగు పడింది. నడిగూడెంలోని ప్రధాన రహదారిపై ఉన్న పలు భారీ వృక్షాల కొమ్మలు విరిగాయి.

ధాన్యం పూర్తిగా తడిసిపోయింది

అమీనాబాద్ ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వారం రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చాను. ధాన్యం ఆరబోసుకుని కాంటాల కోసం ఎదురు చూస్తున్నా. ఆదివారం కురిసిన వడగండ్ల వానకు ధాన్యం కల్లంలోనే తడిసిపోయింది. పూర్తిగా నష్టం వాటిల్లింది.


– నాగరాజు, రైతు అమీనాబాద్, అనంతగిరి మండలం



సూర్యాపేట అర్బన్ : కూలిన ప్రహరీ



అర్వపల్లి: జాజిరెడ్డిగూడెంలో గేదెపై కూలిన చెట్టు



అనంతగిరి పీఏసీఎస్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆవేదన

అనంతగిరి: మండల వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. అమీనాబాద్, గోలతండ, త్రిపురవరం, వాయిలసింగారం, బొజ్జగూడెంతండా, గోండ్రియాల, శాంతినగర్, ఖానాపురం, అనంతగిరి గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. గత వారం రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యం ఆరబోసుకని కాంటాల కోసం ఎదురుచూస్తున్నా కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

లక్ష్యానికి మించి ఆదాయం

- టార్గెట్‌ను అధిగమించిన సూర్యాపేట, తుంగతుర్తి, తిరుమలగిరి, నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్లు
- లక్ష్యం రూ.32.02 కోట్లు.. వసూలు రూ.33.14 కోట్లు



తిరుమలగిరి (తుంగతుర్తి): జిల్లాలో 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా మార్కెటింగ్ శాఖకు నిర్దేశిత లక్ష్యానికి మించి ఆదాయం వచ్చింది. ఆరు వ్యవసాయ మార్కెట్లలో కోదాడ, హుజూర్‌నగర్ మినహా మిగిలిన సూర్యాపేట, తుంగతుర్తి, తిరుమలగిరి, నేరేడుచర్ల మార్కెట్లు టార్గెట్‌ను అధిగమించాయి. 2024-25లో మార్చి నుంచి ఏప్రిల్ వరకు మార్కెట్ కమిటీల ద్వారా రూ.32.02 కోట్ల మేర ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా రూ.33.14 కోట్ల ఆదాయం సమకూరింది. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ సెలక్షన్ గ్రేడ్ మార్కెట్లుగా, తుంగతుర్తి స్పెషల్ గ్రేడ్ మార్కెట్‌గా, నేరేడుచర్ల గ్రేడ్-2 మార్కెట్‌గా, తిరుమలగిరి గ్రేడ్ – 3 మార్కెట్‌గా విభజించారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.10.57కోట్లు కాగా.. రూ.13.11కోట్లు వసూళ్లు సాధించింది. అదేవిధంగా తుంగతుర్తి మార్కెట్ లక్ష్యం రూ.2.25కోట్లు కాగా.. వసూళ్లు రూ.2.39 కోట్లు, తిరుమలగిరి మార్కెట్ లక్ష్యం రూ.5.23కోట్లు అయితే వసూళ్లు రూ.5.67కోట్లు, నేరేడుచర్ల మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.77కోట్లు కాగా.. వసూళ్లు రూ.1.99కోట్లు సాధించింది. ఇక.. కోదాడ రూ.4.49కోట్లు, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీలు రూ.5.45కోట్ల వసూళ్లు సాధించాయి. మార్కెట్లలో జరిగే పంటల విక్రయాలు, పలు రకాల ఫీజులు, గోదాములు, దుకాణాల అద్దెలు, చెక్ పోస్టులు, సీసీఈ కొనుగోలు కేంద్రాలు, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇలా పలు రకాలుగా ఆదాయం సమకూరింది.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో సంవత్సరం పొడవునా క్రయ విక్రయాలు జరుగుతాయి. నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాం. మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరుతాం.

– చామంతి, మార్కెట్ చైర్‌పర్సన్, తిరుమలగిరి

ఆదాయ లక్ష్యాలు

మార్కెట్	లక్ష్యం	వసూళ్లు (రూ.కోట్లలో)
సూర్యాపేట	10.57	13.11
కోదాడ	6.32	4.49
హుజూర్‌నగర్	5.86	5.45
తుంగతుర్తి	2.25	2.39
తిరుమలగిరి	5.23	5.67
నేరేడుచర్ల	1.77	1.99

5లక్షల ఎకరాలకుపైగా పంటల సాగు

జిల్లాలో ఈ సంవత్సరం 5 లక్షలకు పైగా ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో ఎక్కువగా వరి, పత్తి రైతులు సాగు చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యం, పత్తికి సంబంధించి మార్కెట్ ఫీజులు వసూలు కావడంతో ఎక్కువగా ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది.

అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దు

- ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : శాంతిభద్రతల దృష్ట్యా జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించొద్దని ఎస్పీ నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీజేలను నిషేధించడం జరిగిందని, పండుగలు, పెళ్లిళ్లు, ఇతర సందర్భాలలో డీజేలు ఉపయోగించొద్దని తెలిపారు. పండుగలు, సంప్రదాయ ఉత్సవాలు జరిగే సమయంలో ప్రభలు, డ్యాన్స్ ప్రోగ్రాం పేరుతో అశ్లీల నృత్యాలు, అసభ్యకరమైన డాన్సులు ప్రదర్శిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 255 కిలో మీటర్ల మేర జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయని, దీనిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో ప్రమాద స్థలాల వద్ద నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

స్వర్ణోత్సవ సమ్మేళనం.. మది నిండా సంతోషం



స్వర్ణోత్సవ సమ్మేళనంలో 1973-75 బ్యాచ్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు

- 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం నిర్వహించారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1973–75 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ బైపీసీకి చెందిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత కలుసుకొని తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు తమ బాగోగులు తెలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థి, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ వర్ధెల్లి మురళి మాట్లాడుతూ.. యాభై ఏళ్ల క్రితం ఈ కళాశాలలో చదువుకున్న తాము మళ్లీ ఇప్పుడు కలుసుకోవడం ఎంతో పునరుత్తేజాన్ని ఇచ్చిందన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇలాంటి వేడుకలు ప్రతి బ్యాచ్ నిర్వహించుకుని తమ పాత స్నేహితులను కలుసుకొని మధురానుభూతి పొందాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శంకర్, శ్యాంసుందర్, అశోక్, రాజేంద్రప్రసాద్, నరేందర్ రెడ్డి, పిచ్చిరెడ్డి, రంగారెడ్డి, అశ్విని కుమార్, నరసింహారావు, డాక్టర్ రామచంద్రరావు, జగన్, రంజన్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ బిడ్డకు ఉన్నత పదవి

- మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్ నియామకం



నల్లగొండ : నల్లగొండ వాసికి మరో ఉన్నత పదవి లభించింది. హైకోర్ట్ జస్టిస్‌గా పలు ఉన్నతస్థాయి హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన జస్టిస్ షమీమ్ అక్తర్‌ను తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ షమీమ్ అక్తర్ ఇటీవల రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా ఏమాత్రం వివాదం లేకుండా ఎస్సీ వర్గీకరణపై నివేదిక ఇచ్చారు. నల్లగొండ పట్టణానికి చెందిన ఒక సామాన్య సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన షమీమ్ పట్టణంలోనే పాఠశాల, ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. నాగపూర్‌లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన అనంతరం ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ చేశారు. నల్లగొండలో దాదాపు 16 సంవత్సరాల లాయర్‌గా ప్రాక్టీస్ చేసి సివిల్, క్రిమినల్, రెవెన్యూ కేసులను వాదించారు. 2002లో జిల్లా కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. తెలంగాణలోని వివిధ న్యాయ స్థానాల్లో సేవలందించారు. న్యాయపరమైన తీర్పులు, సామర్థత, చట్టంపై లోతైన అవగాహన తదితర కారణాలతో జస్టిస్ షమీమ్ అక్తర్‌కు 2017లో హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది.

బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర

బడుగు, బలహీన వర్గాలు ప్రధానంగా కార్మికులు, మహిళలు, పేదల హక్కుల పరిరక్షణలో జస్టిస్ షమీమ్ అక్తర్ కీలక పాత్ర వహించారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం (ఏడీఆర్) ద్వారానే సత్వర న్యాయం లభిస్తుందనే నమ్మకంతో అనేక కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించి కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించారు. రాజ్యాంగం అంశాలపై విశేష పట్టు ఉన్న జస్టిస్ షమీమ్ అక్తర్ తీర్పులు పలు కేసుల తుది నిర్ణయాలకు మార్గదర్శకంగా మారాయి. 2022లో హైకోర్టు న్యాయమూర్తిగా రిటైర్ అయినప్పటికీ అనేక న్యాయ సంబంధిత, రాజ్యాంగ పరమైన అంశాలపై తన ప్రసంగాల ద్వారా యువ న్యాయవాదులు, సహచర న్యాయమూర్తులకు మార్గదర్శకంగా నిలిచారు. ఆయనను తాజాగా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్టా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం జోడు సేవను ఊరేగించారు.

ఉద్యాన సాగుకు ఔట్‌సోర్సింగ్ సేవలు

- సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు
- అన్నదాతలకు తప్పనున్న ఇబ్బందులు



నాగారం : జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సంప్రదాయ పంటలతో నష్టాలు వస్తున్నాయని కొందరు రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. అయితే ఉద్యాన పంటలు సాగు చేసే వారికి సలహాలు, సూచనలిచ్చే అధికారులు, సిబ్బంది అరకొరగా ఉన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తామని ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అన్నదాతలకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ప్రస్తుతం ఐదుగురు మాత్రమే..

జిల్లాలో రైతులు సమారుగా 36,559 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుచేస్తున్నారు. పండ్ల తోటలు 15,846 ఎకరాల్లో, కూరగాయలు 813 ఎకరాల్లో. మిర్చి 14,917 ఎకరాలు, ఆయిల్‌పామ్ 4,885 ఎకరాల్లో సాగవుతుంది. తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, పెన్‌పహాడ్, మోతె, సూర్యాపేట, నడిగూడెం, తిరుమలగిరి, నూతనకల్, ఆత్మకూర్ తదితర మండలాల్లో ఉద్యాన పంటలు అధికంగా సాగుచేస్తుంటారు. మొలకెత్తింది మొదలు పంట చీడపీడల నివారణకు జాగ్రత్తలు పాటించాలి. మెరుగైన దిగుబడులు, గిట్టుబాటు ధర దక్కేలా రైతులను సరైన బాటలో నడిపించేది క్షేత్రస్థాయి సిబ్బందే. జిల్లాలో 23 మండలాలు ఉండగా ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉద్యాన అధికారులు ఉన్నారు. జిల్లాలో హుజూర్‌నగర్, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, మేళ్లచెరువు మండలాలకు అందుబాటులో ఉన్నారు. ప్రస్తుతం ఒక్కో ఉద్యానాధికారి మూడు, నాలుగు మండలాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీంతో ఉద్యాన అధికారులపై అదనపు భారం పడుతోంది. పొరుగు సేవల సిబ్బంది విధుల్లో చేరితే సలహాలు, సూచనలు త్వరితగతిన అందించేందుకు వీలుంటుంది. మూడేళ్ల కిందట ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించగా వారిని తిరిగి చేర్చుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తొమ్మిది మంది సిబ్బంది వచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)

పండ్ల తోటల సాగు	15,846
కూరగాయలు	813
మిర్చి	14,917
ఆయిల్‌పామ్	4,885
ఇతర పంటలు	95
మొత్తం	36,559

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి



ప్రభుత్వ ఆదేశాలు వస్తే జిల్లాలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తాం. ఈమేరకు సిబ్బంది నియామకానికి సంబంధించి ప్రతిపాదనలు ఇప్పటికే పంపించాం.

– నాగయ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, సూర్యాపేట

గుడ్ న్యూస్ ప్రార్థన మందిరంలో మట్టల పండుగ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనగర్ కాలనీలోని గుడ్ న్యూస్ ప్రార్థన మందిరంలో ఈతమట్టలతో ఊరేగింపు చేశారు. తొలుత పాస్టర్ ఊటుకూరి రాజు చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఈత మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



క్లుప్తంగా

ట్రాక్టర్‌పై నుంచి పడి వృద్ధురాలు మృతి

గుండాల: ట్రాక్టర్‌పై నుంచి పడి వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన గుండాల మండలం వస్తాకొండూర్ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన గైగుల్ల రామక్క (65) కుమార్తె అర్వపల్లి మండలం బొల్లంపల్లి గ్రామంలో నివాసముంటోంది. ఆదివారం తన మనవరాలి వరపూజ ఉండడంతో రామక్క బొల్లంపల్లి గ్రామానికి బయల్దేరింది. పెద్దపడిశాల గ్రామానికే చెందిన ఉప్పల మల్లేష్ ట్రాక్టర్‌పై తన అత్తగారింటికి వెళ్తుండగా.. జనగామ జిల్లా దేవరుప్పుల వరకు వస్తానని రామక్క అతడి ట్రాక్టర్ ఎక్కింది. ట్రాక్టర్ గుండాల మండలం వస్తాకొండూర్ గ్రామం శివారులోకి రాగానే అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో పడింది. రామక్కపై ట్రాక్టర్ పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ జి.సైదులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

దేవరకొండ: ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి వెళ్తున్న వ్యక్తి ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం దేవరకొండ పట్టణ శివారులో జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన లింగాల అంకులయ్య(55), తన భార్య ఎల్లమ్మతో కలిసి పని నిమిత్తం ఆదివారం ద్విచక్ర వాహనంపై దేవరకొండకు వచ్చారు. పని ముగించుకొని సాయంత్రం తిరిగి వెళ్తుండగా.. దేవరకొండ పట్టణ శివారులోని డిండి రోడ్డులో ముందు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వీరు వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అంకులయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య ఎల్లమ్మకు గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..

చౌటుప్పల్ రూరల్: మద్యానికి బానిసై పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన దొడ్డి మల్లయ్య(50) రైల్వే గ్యాంగ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా మద్యానికి బానిసైన మల్లయ్య విధులకు హాజరవ్వకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ప్రతిరోజూ మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని భార్యను ఇబ్బంది పెట్టేవాడు. అతడికి మూర్ఛ వ్యాధి కూడా ఉండడంతో మద్యం తాగొద్దని వైద్యులు చెప్పినా వినకుండా నిత్యం మద్యం తాగేవాడు. శనివారం భార్య వ్యవసాయ పనులకు వెళ్లగా.. ఇంట్లోనే ఉన్న మల్లయ్య పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి మల్లయ్య భార్యకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని లాలాగూడ రైల్వే ఆస్పపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

లారీని ఢీకొట్టిన బైక్.. ఇద్దరు యువకులు మృతి

కేతేపల్లి: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం చీకటిగూడెం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. వివరాలు.. ఆదివారం రాత్రి విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీ చీకటిగూడెం బస్ స్టేజీ సమీపంలో జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో నకిరేకల్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. మృతుల సెల్‌ఫోన్‌లు స్విచ్ఛాఫ్ కావడంతో పాటు వారి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతులు కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన వారని తెలిసిందని, పూర్తిస్థాయి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు. మృతుల నిర్ధారణ కోసం కొత్తపేట గ్రామస్తులకు సమాచారం అందించామని పోలీసులు తెలిపారు.

రైస్ మిల్లర్ల పరేషాన్

- రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీతో పడిపోయిన డిమాండ్
- ఎగుమతులు లేక మిల్లుల్లోనే బియ్యం స్టాక్
- ఐదేళ్లుగా అందని సీఎంఆర్ బిల్లులు
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్న మిల్లర్లు



మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వ రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం డిమాండ్ పడిపోయింది. గతంలో కంటే 80శాతం మేరకు మార్కెట్‌లో సన్న బియ్యం డిమాండ్ లేకపోవడంతో తమ వద్ద ఉన్న బియ్యాన్ని ఎలా అమ్ముకోవాలో తెలియక మిల్లర్లు సతమతమవుతున్నారు. పైగా గత వానాకాలం సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యంలో 20శాతం మేరకు నిల్వ ఉండగా ఇప్పుడు కొనుగోలు చేసిన ధాన్యంతో మిల్లుల్లో గోదాములు నిండుకుండలా ఉన్నాయి. మార్కెట్‌లో సన్న ధాన్యానికి డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి.

ఉమ్మడి జిల్లాలో 360కు పైగా మిల్లులు..

ఉమ్మడి జిల్లాలో 360కు పైగా మిల్లులు ఉన్నాయి. వీటిలో నల్లగొండ జిల్లాలో 190, సూర్యాపేట జిల్లాలో 100, యాదాద్రి భువనగిరి జిల్లాలో 70 మిల్లులు ఉన్నాయి. ఇందులో మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోనే 90కు పైగా మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లుల ద్వారా అత్యధికంగా సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు, వివిధ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

పెరిగిపోతున్న మిల్లింగ్ చార్జీలు..

ధాన్యాన్ని కొనుగోలు చేసి బియ్యంగా మార్చి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన ఖర్చులన్నీ పరిగణలోకి తీసుకుంటే పెట్టుబడి కూడా రావడం లేదని మిల్లర్లు వాపోతున్నారు. క్వింటాకు రూ.2300 సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తే దానిని బాయిలర్‌లో వేసేందుకు అదనంగా రూ.300 నుంచి రూ.400 వరకు ఖర్చు వస్తుంది. దీంతో క్వింటాకు రూ.2700 వరకు ధర పడుతుంది. దాన్ని మిల్లింగ్ చేసినట్లయితే 55కేజీల బియ్యం, 10 కేజీల నూక వస్తుంది. 55కేజీల బియ్యానికి రూ.2700 ఖర్చయితే మిల్లులకు కిలో బియ్యానికి హెచ్ఎంటీకి రూ.45, ఇతర క్వాలిటీకి రూ.48 ఖరీదు అవుతుంది. బ్యాగులు, ఎగుమతుల చార్జీలు, హమాలీల ఖర్చులు కలుపుకుంటే కనీసం రూ.5 ఖర్చు పడుతుంది. కానీ మార్కెట్‌లో హెచ్ఎంటీకి రూ.4500, ఇతర సన్న రకాలకు రూ.4800 ధర ఉంది. మొత్తంగా రూ.200 నుంచి రూ.300 వరకు నష్టం వస్తుంది. ప్రధానంగా హెచ్ఎంటీ రకం బియ్యానికి హైదరాబాద్‌లోనే మార్కెటింగ్ ఉంటుంది. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇవ్వడం ద్వారా హైదరాబాద్‌లో హెచ్ఎంటీ రకం బియ్యం అడిగేవారు లేకపోవడతో ధర పడిపోయింది. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతయ్యే సన్నరకం బియ్యం ధర కూడా పడిపోయింది.

కర్ణాటకలో రైస్ భాగ్య పథకం రద్దుతో..

గతంలో సన్న బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కర్ణాటక ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేసే బదులు రైస్ భాగ్య పథకాన్ని(నగదు బదిలీ) అమలు చేశారు. రేషన్ కార్డుదారులకు డబ్బులు ఇస్తే ఆ డబ్బులకు మరికొన్ని కలుపుకుని సన్న బియ్యం కొనుక్కునేవారు. కానీ ఆ రాష్ట్రంలో సన్న ధాన్యం ఎక్కువగా దిగుబడి రావడంతో రైస్ భాగ్య పథకాన్ని రద్దు చేసి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదే తరహాలో బిహార్, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒడిషా, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో సన్న ధాన్యం దిగుబడి అధికంగా వచ్చింది. ప్రస్తుతం తెలంగాణలో బీపీటీ సన్న బియ్యం పంపిణీ చేస్తుండగా రాబోయే 9 నెలలకు కావాల్సిన స్టాక్ ప్రభుత్వం అందుబాటులో ఉంచుకుంది. దీంతో సన్న బియ్యాన్ని ప్రైవేట్ మార్కెట్‌లో కొనే పరిస్థితి లేకుండా పోయింది.

రూ.600 కోట్లు పెండింగ్..

ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని అప్పగించేందుకుగాను సీఎంఆర్ కింద మిల్లులకు ప్రతి సీజన్‌కు కేటాయిస్తుంటారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 270కు పైగా మిల్లులు సీఎంఆర్ పైనే ఆధారపడి నడుస్తున్నాయి. గత పది సీజన్ల నుంచి సీఎంఆర్ బియ్యం అందించినందుకుగాను ప్రభుత్వం నుంచి మిల్లులకు కోట్ల రూపాయల బాకీ పడి ఉంది. ఒక్క నల్లగొండ జిల్లాలోనే రూ.600కోట్లకు పైగా మిల్లింగ్ చార్జీలు రావాల్సి ఉంది. చార్జీలు ఇవ్వాలని మిల్లర్లు పలుమార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చినప్పటికీ ఫలితం లేదు. పైగా మిల్లుల వద్ద గన్నీ సంచులు పెండింగ్‌లో ఉన్నాయని సాకులు చెప్పి దానికి గాను మిల్లింగ్ చార్జీలు సరిపోతుందని ప్రభుత్వం నుంచి సమాధానం రావడంతో మిల్లర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మా ఇబ్బందులను గుర్తించాలి



మిల్లర్ల ఇబ్బందులను కూడా ప్రభుత్వం గుర్తించాలి. రైతులకు మద్దతు ధర ఇవ్వడంలో అన్నిరకాలుగా సహకారం అందించాం. అయినప్పటికీ మాపై నిందలు ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యంకు డిమాండ్ లేకపోవడంతో మిల్లుల్లో ధాన్యం పెద్దఎత్తున పేరుకుపోయింది. వాటిని అమ్ముకునేందుకు కష్టాలు పడుతున్నాం. స్టాక్ ఉన్న నిల్వలకు వడ్డీ, తరుగును పరిగణిస్తే నష్టాలే వస్తాయి.

– గౌరు శ్రీనివాస్, మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మిర్యాలగూడ పరిసరాల్లోని మిల్లుల ద్వారా గత సీజన్‌లో చేసిన మిల్లింగ్ చార్జీలు కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గన్నీ సంచుల పెండింగ్ కారణంతో బిల్లులు ఇవ్వడం లేదు. చిరిగిపోయిన, పనికిరాని బస్తాలకు రూ.21 ధర నిర్ణయించడం వల్ల మిల్లర్లకు నష్టం జరుగుతుంది. మిల్లుల వద్ద గన్నీ సంచులను ప్రభుత్వం తీసుకొని మిల్లింగ్ చార్జీలను వెంటనే చెల్లించాలి.

– వెంకటరమణచౌదరి, మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి

50 ఏళ్ల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో 1971–74 వరకు బీఏ, బీకాం చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన బి. విశ్వనాథంను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. కళాశాలలో మొదటి బ్యాచ్ తమదేనని, తమ బ్యాచ్‌లో మొత్తం 35 మంది ఉండగా.. ఆత్మీయ సమ్మేళనానికి 19 మంది మాత్రమే హాజరయ్యామని పేర్కొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకొని సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి. వెంకటేశులు, పదవీ విరమణ చేసిన అధ్యాపకులు, ఆనాటి పూర్వ విద్యార్థులు ఎస్. బాల్‌రెడ్డి, ఎస్. పిచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరంగయ్య, కృపాకర్, అమృతారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జానకి రాంరెడ్డి, లింగారెడ్డి, యానాల సుదర్శన్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి వనరుల కల్పనలో తుంగతుర్తికి పెద్దపీట



సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు: సాగునీటి వనరుల కల్పనలో తుంగతుర్తి నియోజకవర్గానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పెద్దపీట వేశారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో గల జల సౌధ కార్యాలయంలో ఆదివారం తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన సాగు, తాగునీరు పెండింగ్ పనులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గంలోని 9 మండలాల్లో తాగు, సాగు నీటి సమస్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు వివరించారు. రానున్న రోజుల్లో అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని బిక్కేరు వాగుపై ఆరు చెక్‌డ్యాంలు కట్టడం ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందించగలిగామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాగు నీటి కొరత లేకుండా చూడటం వల్లనే పంట దిగుబడి బాగా పెరిగిందన్నారు. మరికొన్ని మండలాల్లో కూడా చెక్‌డ్యాంల నిర్మాణం అవసరమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అడ్డగూడూరు, శాలిగౌరారం మండలాల్లోని మానాయికుంట చెక్‌డ్యాం, బునాదిగాని కాల్వ, కేతిరెడ్డి కాల్వ పూర్తిచేస్తే వేలాది ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉందని వివరించారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వ, గంధమల్ల రిజర్వాయర్ ద్వారా మరిన్ని చెరువులు నింపాలని ఆయన కోరారు. చెరువులు, కుంటలు, ట్యాంకులు నింపడంతో సాగు మరింత పెరుగుతుందని అన్నారు. నియోజకవర్గంలోని సాగు నీటి ప్రాజెక్టులకు మరిన్ని నిధులను కేటాయించాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



రమేష్ రాథోడ్ మృతదేహం

తిరుమలగిరి: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం గన్యానాయక్‌తండాకు చెందిన రమేష్ రాథోడ్(49) హెడ్‌కానిస్టేబుల్‌గా తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో మూడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రమేష్ రాథోడ్‌కు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుర్చీలోనే కూలబడిపోయాడు. తోటి సిబ్బంది గమనించి వెంటనే సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య, కుమార్తె ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె, ఉన్నారు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్యాంకర్.. ఒకరు దుర్మరణం



నర్సిరెడ్డి (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: బైక్‌ను వెనుక నుంచి కెమికల్ ట్యాంకర్ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామ స్టేజీ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం గ్రామానికి చెందిన వెల్ల నర్సిరెడ్డి(48) సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెంలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామ స్టేజీ వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కెమికల్ ట్యాంకర్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సిరెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కాళ్ల పారాణి ఆరకముందే వివాహిత ఆత్మహత్య



గాయత్రి (ఫైల్)

చౌటుప్పల్: పెళ్లైన 27 రోజులకే ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పద్మశాలికాలనీలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భువనగిరి మండలం అనాజిపురం గ్రామానికి చెందిన గాయత్రి అలియాస్ లావణ్య(19)కు చౌటుప్పల్‌కు చెందిన జెల్ల సంతోష్‌తో మార్చి 16న వివాహం జరిగింది. సంతోష్ స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే ఆదివారం ఉదయం సంతోష్ డ్యూటీకి వెళ్లాడు. సంతోష్ తల్లిదండ్రులు వివాహానికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న గాయత్రి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివాహానికి వెళ్లిన అత్తమామలు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి గాయత్రి విగత జీవిగా కనిపించింది. గాయత్రి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలికి తల్లిదండ్రులు లేరని సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డిని ట్రాక్టర్‌లో నుంచి జేసీబీ సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

యాదగిరిగుట్ట రూరల్: విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న గడ్డి దగ్ధమైంది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్ మండలం తేరాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నల్ల అరుణ్ ఆదివారం 130కట్టల గడ్డిని తన ట్రాక్టర్‌లో లోడు చేసుకుని తేరాల గ్రామం నుంచి వయా ఆలేరు, బాహుపేట మీదుగా పెద్దకందుకూరు గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బాహుపేట గ్రామానికి రాగానే విద్యుత్ తీగలు గడ్డి కట్టలకు తాకడంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు పెద్దవి కావడంతో డ్రైవర్ అరుణ్ ట్రాక్టర్‌పై నుంచి కిందకు దూకాడు. ట్రాక్టర్ రోడ్డు పక్కన ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. వెంటనే స్థానికుల సహాయంతో హుటాహుటిన చెరువులోని నీళ్లతో గడ్డికి అంటుకున్న మంటలను ఆర్పుతూ, జేసీబీ సహాయంతో దగ్ధమవుతున్న గడ్డిని కిందపడేశారు. అరుణ్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నాలుగు టీంలతో గాలింపు

నల్లగొండ: నల్లగొండలో సంచలనం సృష్టించిన మణికంఠ ఫొటో కలర్ ల్యాబ్ యజమాని గద్దపాటి సురేష్ హత్య కేసు విచారణ కొనసాగుతోంది. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నిందితులను పట్టుకునేందుకు నాలుగు టీంలను ఏర్పాటు చేయగా.. ఆ టీంలు గాలింపు చర్యలు చేపట్టాయి. టూటౌన్ పోలీసులు అనుమానితులతో పాటు హత్యకు ముందు మృతుడితో ఫోన్‌లో మాట్లాడిన వారిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం.

ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్

నార్కట్‌పల్లి: ప్రమాదవశాత్తు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటన ఆదివారం రాత్రి నార్కట్ మండలం బాజకుంట గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బాజకుంట గ్రామానికి చెందిన వర్కాల దుర్గమ్మ ఇంట్లో వంట చేసేందుకు గాను గ్యాస్ స్టవ్ వెలిగించింది. ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్‌కు నిప్పంటుకుని పేలింది. దీంతో ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడిపోగా.. మరికొన్ని వస్తువులు మంటలకు కాలిపోయాయి. దుర్గమ్మ కుటుంబ సభ్యులు ఇంట్లోంచి బయటకు రావడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అనారోగ్య కారణాలతో బలవన్మరణం

సూర్యాపేటటౌన్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని చర్చి కాంపౌండ్‌కు చెందిన గుండగాని సైదులు(40) వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత మూడేళ్లుగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అనారోగ్య సమస్యలు భరించలేక ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య మల్లిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణంలోని రాంనగర్‌కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన దుండగుల కురుమయ్య, నేలపాటి ధనియాలు, తన్నీరు వెంకటేశం, తన్నీరు ఆదినారాయణ, కూసుకూరి నాగరాజు, మామిడిశెట్టి ప్రసాద్ రాంనగర్‌కాలనీలోని చెట్ల పొదల్లో పేకాట ఆడుతుండగా.. పోలీసులు అదులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5,000 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బీపీ మండల్ సిఫారసులు అమలుచేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘం నాయకులు

మునుగోడు: దేశంలో అధికశాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తగినా వాటా ఇవ్వాలని బీపీ మండల్ చేసిన సిఫారసులను ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బీపీ మండల్ 43వ వర్ధంతి సందర్భంగా మునుగోడులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీసీల సామాజిక స్థితిగతులపై బీపీ మండల్ సమగ్ర అధ్యయనం చేసి ఇచ్చిన 40 సిఫారసుల్లో కేవలం 2 మాత్రమే అమలు చేయడం విచారకరమన్నారు. మిగిలిన సిఫారసులను అమలుచేసే వరకు తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వంకటాచారి, యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లికార్జున్‌గౌడ్, మిర్యాల వెంకన్న, ఈదులకంటి కైలాస్‌గౌడ్, పాలకూరి కిరణ్, మేకల మల్లయ్యయాదవ్, యాదప్ప, లింగయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



కేతేపల్లి: ధ్వంసమైన కారు

కేతేపల్లి: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన చల్లా రఘురాములు, చల్లా అశోక్, దిలీప్ కలిసి ఖమ్మంలో తమ బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామ జంక్షన్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కేతేపల్లి 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రఘురాములు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కారు ఢీకొని..

బీబీనగర్: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూరుకు చెందిన వినయ్, గౌతమ్ బైక్‌పై హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్తుండగా.. బీబీనగర్ మండల కేంద్రంలోకి రాగానే వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినయ్, గౌతమ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మిస్టరీగానే తల్లి, కుమార్తె మరణం

- మూడు బృందాలతో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు


మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన తల్లి, కుమార్తె మరణం మిస్టరీగానే మారింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన గుర్రం సీతారాంరెడ్డి తన అక్క కుమార్తె రాజేశ్వరి(34)ని 2008లో వివాహం చేసుకున్నాడు. అప్పటికే ఓ ప్రైవేట్ ఆగ్రో కెమికల్ సంస్థలో పనిచేస్తున్న సీతారాంరెడ్డి నల్లగొండ జిల్లా సేల్స్ మేనేజర్‌గా బదిలీపై 15ఏళ్ల క్రితమే మిర్యాలగూడకు వచ్చి హౌసింగ్‌బోర్డులో అద్దెకు ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు వేదశ్రీ, వేద సాయిశ్రీ(13) సంతానం. ఈ నెల 10న కంపెనీ బడ్జెట్ ఆడిట్ సమావేశం ఉండటంతో సీతారాంరెడ్డి హైదరాబాద్‌కు వెళ్లాడు. రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చిన సీతారాంరెడ్డికి గొంతుపై గాయాలతో చిన్న కుమార్తె వేద సాయిశ్రీ, బెడ్‌రూంలో ఉరేసుకుని భార్య రాజేశ్వరి మృతిచెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందించాడు.

నోరు విప్పని పెద్ద కుమార్తె..

సీతారాంరెడ్డి పెద్ద కుమార్తె వేదశ్రీ నోరు విప్పితేనే రాజేశ్వరి, వేద సాయిశ్రీ మృతికి గల కారణాలు తెలుస్తాయి. కానీ ఆమె మాత్రం తాను శుక్రవారం రాత్రి నిద్రపోగా శనివారం మధ్యాహ్నం మేలుకువ వచ్చిందని చెబుతోంది. దీంతో వారిపై మత్తు పదార్థాల ప్రయోగం జరిగిందా..? అనే అనుమానాలకు తావిస్తోంది. అయితే సీతారాంరెడ్డి హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు వస్తున్న సమయంలో 'ఎక్కడ ఉన్నావు డాడీ' అంటూ మెసేజ్ చేయడం, తల్లి ఫోన్‌కు వరుసగా వస్తున్న ఫోన్ కాల్స్‌ను కట్ చేయడం వంటివి చూస్తే పెద్ద కుమార్తె వేదశ్రీ స్పృహలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

ఇద్దరి మృతదేహాలపై కత్తి గాట్లు..

రాజేశ్వరి ఎడమ చేయి మణికట్టు, పాదాల వద్ద కత్తిగాయాలు ఉండగా, వేద సాయిశ్రీ గొంతును పదునైన కత్తితో కోసినట్లుగా పోలీసులు గుర్తించారు. అయితే మృతురాలి కుటుంబ సభ్యులు మాత్రం ఇది హత్యగానే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసును ఛేదించేందుకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు నేతృత్వంలో మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే మృతుల ఇంట్లో ఓ లేఖ లభ్యమైనట్లు ప్రచారం జరుగుతుండగా పోలీసులు మాత్రం దానిని ధ్రువీకరించడం లేదు. మిర్యాలగూడ వన్ టౌన్ సీఐ మోతీరాం పర్యవేక్షణలో తల్లి, కుమార్తె మృతదేహాలకు ఆదివారం పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించారు.



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద మృతుల బంధువులు

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం: డీఎస్పీ

తల్లి, కుమార్తె మరణంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మూడు బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మృతుల శరీరాలపై కత్తిగాట్లు ఉన్నందున పోస్టుమార్టం నివేదిక తర్వాత క్లూస్‌టీం సమాచారం మేరకు లోతైన విచారణ చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.